భక్తులతో కిటకిటలాడిన బాసర



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

బాసర,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది.అక్షర శ్రీకార పూజల కోసం శుభప్రదమైన దశమిపర్వదినం ఉండడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.ఉదయం నుండి సాయంత్రం వరకు రెండు మండపాల్లో పూజలు కొనసాగాయి.మొదట గోదావరి తీరంలో భక్తులు పుణ్యస్నానలు ఆచరించి,నది ఒడ్డున గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

కడెం పూడికకు మోక్షం



కడెం రిజర్వాయర్

- రాజస్థాన్ కంపెనీకి పనుల అప్పగింత
- ఇక తీరనున్న నీటి నిల్వ సామర్థ్యం సమస్య
- కడెం ప్రాజెక్టులో ఇక పుష్కలంగా నీరు
- తొలగించిన మట్టి, ఇసుక అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్

నిర్మల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు ముప్పుగా మారుతున్న పూడికను తొలగించేందుకు ఎట్టకేలకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రభుత్వం కడెం ప్రాజెక్టుతో పాటు కరీంనగర్ జిల్లాలోని మిడ్‌మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లలో ప్రయోగాత్మకంగా పూడికతీతను తొలగించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగా పూడిక తొలగింపు కోసం నిర్వహించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. పూడిక తొలగింపు పనులతో పాటు ఆ పూడికను ప్రాసెసింగ్ చేసే పనులను రాజస్థాన్‌కు చెందిన కంపెనీ దక్కించుకుంది. సదరు కంపెనీ టెండర్ విధానంతో ఈ పనులను దక్కించుకుంది. ఈ కంపెనీ 20 సంవత్సరాల వరకు కడెం ప్రాజెక్టులోని పూడికను ఎప్పటికప్పుడు తీసి ఆ పూడికను ప్రాసెసింగ్ చేయాల్సి ఉంటుంది. దీని కోసం గాను ప్రాజెక్టు సమీప ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్‌ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రాసెసింగ్ యూనిట్ కోసం ఇప్పటికే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని సైతం గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రస్తుతం కడెం ప్రాజెక్టులో రెండు నుండి మూడు టీఎంసీల లోతు వరకు పూడిక పేరుకుపోయినట్లు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 7.630గా అధికారులు నిర్ధారించినప్పటికీ ఏటేటా పెరిగిపోతున్న పూడిక కారణంగా ఈ ప్రాజెక్టు నీటిమట్టం దాదాపు సగానికి పైగా తగ్గిపోయిందని అంటున్నారు. ఈ లెక్కన ప్రాజెక్టు ప్రస్తుతం నాలుగు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి మాత్రమే పరిమితమైందని అంటున్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్ ఎగువన దాదాపు 15 నుండి 18 కిలోమీటర్ల పొడవు వరకు పూడిక ఉన్నట్లు దీనిపై జరిపిన సర్వేలెక్కలు చెబుతున్నాయి. ప్రతిఏటా ఈ ప్రాజెక్టులోకి ఎగువ నుండి పెద్ద ఎత్తున వరద ప్రవాహం కొనసాగుతుంది. ఈ వరద ప్రవాహం కారణంగా ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున చెత్తా చెదారం, బురద, మట్టి లాంటివి వచ్చి చేరుతున్నాయి. దీంతో ఏటేటా పూడిక పెరిగిపోయింది. ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపు సాధ్యం కాదని గతంలో ఇరిగేషన్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూడిక సమస్యపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. దీనికి అనుగుణంగా నిపుణులతో చర్చించి పరిష్కార మార్గాన్ని అన్వేషించింది. ఇందులో భాగంగానే మూడు ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా ఎంపి క చేసి ఈ ప్రాజెక్టుల్లో పూడికతీత చర్యలకు శ్రీకారం చుట్టింది.

రాజస్థాన్ కంపెనీకి దక్కిన టెండర్

జనవరి మాసంలోనే కడెం ప్రాజెక్టు పూడికతీత పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగింది. ఎట్టకేలకు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఈతర్ కంపెనీ పూడికతీత, ప్రాసెసింగ్ పనులను దక్కించుకుంది. అయితే ఈ కంపెనీ ప్రభుత్వానికి టన్ను పూడిక మట్టికి 407 రూపాయల ధరను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే 20 ఏళ్ల వరకు ఈ పనులను ఈతర్ కంపెనీ నిర్వహించనుంది.

ప్రత్యేకంగా ప్రాసెసింగ్ యూనిట్, స్టాక్ పాయింట్‌ల ఏర్పాటు

కడెం ప్రాజెక్టులోని పూడికతీత పనులను దక్కించుకున్న ఈతర్ కంపెనీ ఆధ్వర్యంలో సిల్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. దీనికోసం ఇప్పటికే అధికారులు దాదాపు 100 ఎకరాల స్థలాన్ని సేకరించారు. మండలంలోని ఎర్వచింతల్, రేవోజిపేట్, సోమవార్‌పేట్‌లలో స్థలాన్ని సేకరించారు. కాగా ఇందులో నుండి 20 ఎకరాలలో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. కాగా మిగిలిన మరో 80 ఎకరాలలో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ప్రాజెక్టు రిజర్వాయర్ నుండి తీసే పూడికను ఇక్కడి ప్రాసెసింగ్ యూనిట్‌లో ఇసుకగా అలాగే మట్టిగా వేరు చేయనున్నారు. ఇక్కడి ప్రాసెసింగ్ యూనిట్ నుంచి ఇసుక, మట్టిని స్టాక్ పాయింట్‌కు తరలిస్తారు. ఇక్కడ మట్టి నుండి వేరు చేసిన ఇసుకను సదరు ఏజెన్సీ యజమాని విక్రయించుకునేందుకు లైసెన్స్‌ను ప్రభుత్వం జారీ చేస్తుంది. అలాగే మట్టిని రైతులకు పంట పొలాల కోసం ఇవ్వనున్నారు. అలాగే ఇటుకల తయారీతో పాటు మట్టితో తయారయ్యే ఇతర అవసరాల కోసం విక్రయించనున్నారు.

పూడికతీతకు ఆధునిక యంత్రాలు

కాగా కడెం ప్రాజెక్టులో ఆధునిక టెక్నాలజీని ఉపయో గించి, సరికొత్త యంత్ర పరికరాలతో పూడికతీత పనులను చేపట్టనున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుముఖం పట్టే నవంబరు, డిసెంబరు నెలల నుండే పూడికతీత పనులు చేపట్ట నున్నారు. ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఆధునిక యంత్రాల ద్వారా వ్యాక్యూమ్ సిస్టంతో పూడికను వెలికి తీయనున్నారు. దాదాపు 7 నెలల పాటు నిరాటంకంగా ఈ ప్రాజెక్టు నుంచి పూడికను తొలగించే పనులు చేపట్టే విధంగా ఆధునిక సాంకేతికతను వినియోగించుకోనున్నారు. ముఖ్యంగా వేసవికాలంలో పూడికతీత పనులు మరింత వేగంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.

టేల్ అండ్ భూములకు ఇక సాగునీరు...

పూడికతీత పనుల కారణంగా రెండు మూడేళ్లలో కడెం ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడనుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాజెక్టు కింద 68 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ రిజర్వాయర్‌లో పూడిక కారణంగా నీటిమట్టం తగ్గిపోవడం, అలాగే కలువలకు మరమ్మతులు చేయకపోతుండడంతో సగం భూములకు కూడా సాగునీరందడం లేదన్న ఆరోపణలున్నాయి. కడెం ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి ప్రతిఏటా వర్షాకాలంలో పుష్కలంగా వరద నీరు వస్తున్నప్పటికీ రబీ పంటలకు మాత్రం పూర్తిస్థాయిలో సాగునీరు అందించలేని పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు. పూడికతీత పనులు మొదలు కాబోతున్నందున ఇక ఈ ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు కూడా పూర్తిస్థాయిలో సాగునీరు అందనుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి దేవరకోట బ్రహ్మోత్సవాలు



ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రాచీన సుప్రసిద్ధ దేవరకోట వెంకటేశ్వరస్వామి 68వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 8న మంగళవారం నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు కే.శ్రీహరిరావుకు ఆలయ కమిటీ చైర్మన్ కొండా శ్రీనివాస్ సోమవారం వేరువేరుగా కలిసి అందజేశారు. ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఆలయ ధర్మకర్తలు ఒడ్నం నరేందర్, సంతోష్, చిరంజీవి, జి. చిన్న రాజన్న, దేవేందర్‌గౌడ్, జాదవ్ అనిత, భీమ్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా వార్షికోత్సవం

సోన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో గల సాయిబాబా 18వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు విఠల్ ప్రత్యేక పూజలు, మహా యజ్ఞం నిర్వహించారు. అనంతరం మహాఅన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పది మూల్యాంకన ప్రారంభం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ స్కూల్‌లో సోమవారం పది పరీక్ష పత్రాల మూల్యాంకన ప్రారంభమైంది. ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించారు. డీఈవో రామారావు ఆయన వెంట ఉన్నారు. ఆర్జేడీ పలు సూచనలు చేశారు. మూల్యాంకన కేంద్రానికి మొబైల్‌ఫోన్లను అనుమతించమని అన్నారు. గోప్యత పాటించాలన్నారు. సమాధాన పత్రాలలో ఎలాంటి తప్పులు లేకుండా దిద్దాలన్నారు. ఇప్పటి వరకు విధులకు హాజరుకాని వారు మంగళవారం చేరాలన్నారు. లేనట్టయితే సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలుంటాయన్నారు. క్యాంపు ఆఫీసర్లు మూడారపు పరమేశ్వర్, వైవి రమణారెడ్డి, సీఈలు, ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో చెస్ పోటీలు



చెస్ విజేతలతో వీసీ గోవర్దన్, ఓఎస్డీ మురళీధర్షన్,ఏవో రణధీర్

బాసర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో రెండు రోజుల చెస్ పోటీలు విజయవంతంగా సోమవారం ముగిశాయి. గ్యాప్‌స్కిల్ లెర్నింగ్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. 200 మంది విద్యార్థులు పాల్గొనగా ఆరురౌండ్లలో పోటీలు కొనసాగాయి. గెలుపొందిన విద్యార్థులకు రూ 26 వేల నగదు బహుమతులతో పాటు 50 చెస్ బోర్డులను అందజేశారు. చెస్ ఆట అనేది క్రీడమాత్రమే కాదు అది మనోబలాన్ని పెంచే సాధనమని వీసీ గోవర్ధన్ అన్నారు.ఈ కార్యక్రమంలో చెస్ నెట్‌వర్క్ ప్రతినిధులు సంజయ్ ,హరి శ్రీరామోజు,రాజన్న,క్యాంపస్ క్రీడ అధికారులు ప్రభాకర్‌రావు,పీడీ శ్యాంబాబు, పీఈటీలు వసంత విద్యార్థులు పాల్గొన్నారు.

పసుపు దొంగిలిస్తున్న యువకుడి అరెస్ట్

లక్ష్మణచాంద, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పంట కల్లాల్లోని పసుపును దొంగిలిస్తున్న పొట్టపెల్లి(కె) గ్రామానికి చెందిన మాచిట్ల శ్రీను అనే యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జుబేర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మణచాంద గ్రామానికి చెందిన బొగడమీది ముత్తన్న అనే రైతు తన పసుపు దొంగతనం జరిగిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా కనకాపూర్ గ్రామంలోని సయ్యద్ ఖలీల్ అండ్ ట్రేడర్స్ దుకాణంలో మాచిట్ల శ్రీను పసుపు అమ్ముతుండగా అనుమానం రావటంతో పట్టుకుని విచారించగా అతడు నేరం అంగీకరించినట్లు వివరించాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కోర్టు నోటీసు ధిక్కరించిన కేసులో ఓ మహిళకు జైలు శిక్ష

ఖానాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కోర్టు నోటీసు ధిక్కరించిన కేసులో ఓ మహిళకు జైలు శిక్ష పడినట్లు ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖానాపూర్ మండలం ఎగ్బాల్‌పూర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ వందన గతంలో నాటు సారాయి అమ్ముతూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడినట్లు పేర్కొన్నారు. సదరు కేసులో ఆమెపై కేసు నమోదు చేసి ఖానాపూర్ కోర్టులో చార్జిషీట్ వేయగా ఖానాపూర్ కోర్టుకు హాజరుకావాలని వందనకు నోటీసులు జారీ అయ్యాయి. ఆమె కోర్టు నోటీసులను లెక్క చేయకుండా కోర్టుకు హాజరు కాకపోవడంతో ఖానాపూర్ మేజిస్ట్రేట్ వందనకు అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. కోర్టు నుండి అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో సదరు మహిళను అరెస్ట్ చేసి ఖానాపూర్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఆమెకు పది రోజుల పాటు జైలు శిక్షను విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించినట్లు సీఐ పేర్కొన్నారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు గుగ్లావత్ వందనను ఆదిలాబాద్ జైలుకి తరలించినట్లు సీఐ రంగస్వామి, ఎస్సై అభిషేక్ పేర్కొన్నారు.

ముథోల్‌లో దొంగల హల్‌చల్

ముథోల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని కాల్వ గల్లీలో బైపాస్ రోడ్డు పక్కన గల హనుమాన్ ఆలయంలో ఆదివారం రాత్రి ఇద్దరు దొంగలు చోరీకి యత్నించారు. ఆలయంలో ఏమి దొరకకపోవడంతో బయటకు వచ్చి ఓ బైక్‌ను దొంగిలించి మరో బైక్ దొంగిలించే క్రమంలో ఒకరిని గల్లీ వాసులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్సై సంజీవ్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. పట్టుబడ్డ దొంగను పోలీసులకు అప్పజెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంబలి ఉచితంగా పంపిణీ ప్రారంభం

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ వద్ద సోమవారం ఉచిత అంబలి, చలివేంద్రంను ప్రారంభించినట్లు పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్ తెలిపారు. పాకాల ముత్తన్న స్మారకార్థం ఉచిత అంబలి, చలివేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



స్థానిక ప్రభుత్వ మాత, శిశు సంరక్షణ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మాత, శిశు సంరక్షణ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎస్ఎన్‌సీయూ, పోస్ట్ ఆపరేషన్, ఇంజక్షన్ వార్డులను పరిశీలించి రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వైద్య చికిత్సలు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను సంఖ్యను పెంచాలని, ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి, నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అవుట్ పోస్ట్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై రోగులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఆసుపత్రి వైద్యులు డా. సరోజ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులంతా ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటించి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అందజేయాలన్నారు. నూతన పథకాలు అమలు, ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

టెలిఫోన్ ప్రజావాణిలో భాగంగా అర్జీలను స్వీకరణ

అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజల అర్జీలను ఫోన్ ద్వారా స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, సంబంధిత అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కాగా సోమవారం టెలిఫోన్ ప్రజావాణి ద్వారా 10 మంది దరఖాస్తుదారులు తమ అర్జీలను సమర్పించారు. దరఖాస్తు వివరాలను వాట్సప్ ద్వారా స్వీకరించి, ప్రజావాణిలో సమస్య నమోదుకు సంబంధించి రసీదును సంబంధిత వ్యక్తులకు వాట్సప్ ద్వారా అందించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టవర్ పేరిట కుచ్చుటోపి.. రూ.72 వేలు దోచేసిన సైబర్ నేరగాళ్లు



బాధితుడు ఫోన్ పే చేసిన వివరాలు

ముథోల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : టవర్ పేరిట డబ్బులు దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు అమాయకులను టార్గెట్ చేసి డబ్బులు కాజేస్తున్నారు. ఇలాంటి సంఘటననే ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో చోటుచేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం... మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన సత్తిరాములు అనే వ్యక్తి వృత్తిరీత్యా గేదెలను మేపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే సత్తి రాములుకు వారం రోజుల కిందట ఒక గుర్తు తెలియని ఫోన్ కాల్ వచ్చింది. అయితే తాము మీ గ్రామంలో ఐడియా, వోడాఫోన్‌కు సంబంధించిన టవర్ వేస్తామని దానికి సంబంధించిన రెండు గుంటల స్థలం ఇచ్చినట్లయితే పది సంవత్సరాల అగ్రిమెంట్ చేసుకొని రూ.25 లక్షల రూపాయలతో పాటు నెలకు రూ. 25 వేలు ఇస్తామని చెప్పారు. అలాగే కుటుంబంలో ఒకరికి పని కల్పించి వారికి కూడా నెలకు రూ. 15 వేలు కట్టిస్తామని నమ్మబలికారు. దీంతో బాధితుడు తమకు గ్రామం పక్కన భూముందని అందులో నుంచి టవర్ కోసం రెండు గుంటల భూమి ఇస్తానని చెప్పాడు. అయితే సదరు సైబర్ నేరగాడు సంబంధిత పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు పంపియ్యాలని పేర్కొన్నారు. దీంతో బాధితుడు తమ డీటెయిల్స్‌ను వాట్సాప్ ద్వారా సెండ్ చేశారు. దీంతో వాట్సాప్ ద్వారా ఒక పత్రాన్ని సృష్టించి బాధితుడికి సెండ్ చేశాడు. అయితే వెంటనే నీకు రెండు రోజుల్లో రూ. 10 లక్షల చెక్కు వస్తుందని కాగితాల ఖర్చు రూ. 5,200 ఫోన్ నెంబర్‌కు పే చేయాలని భాను ప్రకాష్ అనే మోసగాడు తెలపడంతో ఇచ్చిన నెంబర్‌కు తమ అకౌంట్ నుండి ఫోన్‌పే చేశారు. వెంటనే మరుసటి రోజు తమ అకౌంట్‌లో రూ. 10 లక్షల రూపాయలు వేయాలంటే మరో రూ.23,400 నాకు పంపిస్తే రూ.10 లక్షలు మీ ఖాతాలో జమ చేస్తానని నమ్మబలకడంతో మళ్లీ రూ. 23,400 ఫోన్ పే చేశాడు. మరుసటి రోజు బాధితుడు నా అకౌంట్‌లో డబ్బులు రాలేవని ఫోన్ చేయగా ఆ డబ్బులు మా లాయర్ అకౌంట్‌లో ఉన్నాయని అకౌంట్ ప్రాబ్లమ్ వల్ల వెళ్ల లేవని చెప్పాడు. వేరే నంబర్ చెబుతాను దానికి నీవు రూ. 7 వేలు వెయ్యి నేను రూ. 16 వేలు వేస్తా అని నమ్మబలికి రూ. 21 వేలు, మరో రోజు 16 వేలు బాధితుడి నుంచి మొత్తం రూ. 72,600లు లాగేశారు. శనివారం తమ ఖాతాలో డబ్బులు రాకపోవడంతో బాధితుడు పలు సార్లు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో డయల్ నెంబర్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. వెంటనే ముథోల్ పోలీసులు బాధితుడి వివరాలు అడిగారు. 1930కు కాల్ చేసి ఆన్‌లైన్ ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ ఫిర్యాదు చేయడం జరిగిందని ముథోల్ ఎస్సై సంజీవ్ ఆంధ్రజ్యోతితో తెలిపారు. వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమని మీకు ఆఫర్లు ఉన్నాయి డబ్బులు కట్టమని చెప్పిన ఎట్టి పరిస్థితుల్లో వాటిని నమ్మవద్దని అన్నారు. ప్రతి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

బాధిత కుటుంబానికి

ఎల్‌వోసీ చెక్కు అందచేత



భైంసా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని తానూర్ మండలం దహెగాం గ్రామానికి చెందిన కళాబాయి వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.2.5 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో సంబంధిత మంజూరి ఎల్‌వోసీ చెక్కును ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి బాధిత కుటుంబానికి అందచేశారు. కళాభాయికి గుండే అపరేషన్ అవసరమున్న దృష్టా బాధిత కుటుంబం ఆర్థిక పరిస్థితిని జిల్లా ఇంచార్జీ మంత్రివర్యులు సీతక్క దృష్టికి తీసుకవెళ్లినట్లుగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క ప్రభుత్వం నుంచి రూ.2.5 లక్షలు మంజూరి చేయించిందని వివరించారు. సంబంధిత రూ.2.5 లక్షల ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబానికి అందించినట్లుగా తెలిపారు. ఇందులో కాంగ్రెస్ ప్రతినిధి బాశెట్టి రాజన్న, మాజీ సర్పంచ్ పుప్పాల సాయినాథ్, గోవింద్‌రావ్, శేషరావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

తుడుందెబ్బ

రాష్ట్ర మహాసభ కరపత్రాల విడుదల

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్ అండ్‌బి యందు తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 12, 13, 14 తేదీల్లో కొమురం భీమ్, ఆసిఫాబాద్ జిల్లా మెరమేరీ మండలం జోడేఘాట్‌లో నిర్వహించే తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై మైనారిటీలకు అవగాహన

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీలకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. అడ్వైజర్ సుభాష్ ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ కేంద్రం సందర్శించారు. మైనారిటీలకు రాజీవ్ యువశక్తి పథకంతో పాటు పీఎం ఈజీపీ రుణం అందుబాటులో ఉన్నాయని మహిళలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అవగాహన లేక పథకాలు వినియోగించుకోవడం లేదన్నారు. సరైనపత్రాలు ఉంటే వ్యాపారం కోసం రుణాలు లభిస్తాయన్నారు. ముస్లిం ఏక్తా సంఘం అధ్యక్షుడు షైక్ ముజాహిద్, అఫ్రోజ్‌పాషా, జుబేర్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖానాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు కాలనీలలో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఖానాపూర్ ఏఈ రాంసింగ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున పద్మావతి నగర్, బస్టాండ్ ఏరియా, టవర్స్ కాలనీ, ఇంద్రానగర్, మస్కాపూర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గంజాయి మొక్కల స్వాధీనం : ఎస్సై

ఉట్నూర్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరితండ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాముగూడ గ్రామానికి చెందిన కుమ్ర సోనేరావు ఇంటి యొక్క పెరడులో గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నామని ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. సోనేరావు ఇంటి సమీపంలో ఉన్న పెరటిలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడని సమాచారం రావడంతో ఆదివారం రాత్రి పెరటి వద్దకు వెళ్లి ఇంటి పెరడులో ఉన్న 20 గంజాయి మొక్కలు సుమారు 3 ఫీట్ల నుంచి 7 ఫీట్ల ఎత్తు గలవి స్వాధీనం చేసుకుని సోనేరావు పైన కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే అతని భూమి వివరాలు తెలుసుకుని అతనికి వచ్చే ప్రభుత్వ పథకాలు రైతుబంధు, రుణమాఫీ, ఉచిత విద్యుత్ లాంటివి కూడా రాకుండా కలెక్టర్‌కి నివేదిక అందించామన్నారు. రైతులు ఎవరైనా గంజాయి సాగు చేస్తే వారిపై కేసు నమోదుతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సబ్సిడీ పథకాలు రాకుండా అవుతాయన్నారు.

● మరొక గంజాయి కేసు : ఇన్‌చార్జి ఎస్సై

ఉట్నూర్: మండల కేంద్రంలోని ఐటీడీ యొక్క సమీపంలో ఆటోలో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని ఇన్‌చార్జి ఎస్సై దుబ్బాక సునిల్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు ఐటీడీఏ ఆఫీస్ పక్కన గల మిషన్ భగీరథ ప్రాంతంలో గంజాయితో కరీంనగర్‌కు వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో ముగ్గురు వ్యక్తులు గంజాయి కలిగి ఉండా వాళ్ల వద్ద నుంచి సుమారు ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వారు బేల మండలం పర్సువాడ పాటగూడ కుక్రమానికి చెందిన మారుతి అనే వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేశామని వారి సమాచారం పైన మారుతిని కూడా ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగిందన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. మొత్తం ఆనలుగురు వ్యక్తుల నుంచి సుమారుగా రెండు కిలోల (1900 గ్రామ్స్) లోపు గంజాయిని, ఆటోను మరియు 4 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకోవడంజరిగిందన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి : సీఐ

సిరికొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని సీఐ భీమేష్ అన్నారు. పోలీసులు-మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ధర్మాసాగర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు, గుట్కాలు ప్రమాదకరమన్నారు. సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడోద్దని సూచించారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. ఆశ చూపిస్తే వాటికి ఆకర్షితులు కావోద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. వ్యక్తిగత ఫోటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు డ్రైవింగ్ చేయవద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో విద్యుత్ షాక్ లు పెట్టి అటవీ జంతువులను చంపొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శివరాం, గ్రామస్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా చెక్కు అందజేత

తలమడుగు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన వ్యక్తి గత సంవత్సరం ఎలుగు బండి దాడిలో తీవ్రంగా గాయపడగా మెస్రం లచ్చుకు జిల్లా కలెక్టర్ రాజార్షిషా చేతుల మీదుగా ఐదు లక్షల రూపాయల చెక్కు అందజేయడం జరిగిందని, తహసీల్దార్ రాజమోహన్ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యామల దేవి, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లింగాష్టక పారాయణం

సోనాల, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర మందిరంలో సోమవారం సామూహిక లింగాష్టక పారాయణం నిర్వహించారు. ప్రతి సోమవారం ఆలయంలో లింగాష్టక పారాయణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొత్తం 21 వారాల పాటు లింగాష్టకం పారాయణం కొనసాగుతుందన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తి నష్టం

● రామ్‌నగర్‌లో కట్టుబట్టలతో బయటపడ్డ రైతు కుటుంబం

బోథ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామమైన రామ్‌నగర్‌లో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షాక్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రైతు అజాడే నానక్సింగ్‌కు చెందిన దాదాపు రూ.పది లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. దీంతో రైతు కుటుంబం కట్టుబట్టలు మినహా మరేవి కాపాడుకోలేక పోయారు. అంతేకాకుండా ఏడాది అంతా కష్టపడి పండించిన ఖరీఫ్, రబీ పంటలు కాలి బూడిదయ్యాయని బాధిత రైతు వాపోయాడు. దాదాపు 40 క్వింటాళ్ల జొన్నలతో పాటు 10 క్వింటాళ్ల గోధుమలు, కందులు, మొక్కజొన్న, క్వింటాల్ నువ్వులు, రెండు క్వింటాళ్ల ధనియాలు నిత్యావసర సరుకులతో పాటు నలభై తులాల వెండి, అర తులం బంగారం కాలిపోయిందని రైతు కన్నీరుమున్నీరయ్యాడు.



దగ్ధమైన జొన్న, గోధుమ పంటలు

● ఎవరూ లేని సమయంలో..

మధ్యాహ్నం సమయంలో రైతులు పంటపొలాల్లో పనుల్లో నిమగ్నమై ఉండగా విద్యుత్ తీగల రాపిడికి నిప్పురవ్వలు చెలరేగి మంటలు అంటుకున్నాయి. విషయాన్ని గమనించిన రైతులు మంటలు ఆర్పేందుకు అక్కడికి చేరుకున్నా అదుపులోకి రాలేదు. ఇచ్చోడలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పడం జరిగింది. అప్పటికే రైతు సర్వం కోల్పోయాడని గ్రామస్థులు తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కత్తిని చూపుతూ.. చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 07 (ఆంధ్రజ్యోతి) : రామ నవమి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆదిలాబాద్ ర్యాలీలో చించేరివాడకు సంబంధించిన వ్యక్తి తోట విగ్నేష్, కత్తిని చూపిస్తూ చంపేస్తానంటూ బెదిరించినందుకు ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని పట్టణ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా కత్తులను చూపిస్తూ బెదిరించి చంపేస్తామంటూ ప్రజలను భయాభ్రాంతులకు గురి చేసేలా ఎలాంటి చర్యలకు పాల్పడినా.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో నిందితుడు కత్తితో తిరుగుతూ ప్రజలను భయాభ్రాంతులకు గురి చేశాడని అతనిపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రజలు ముఖ్యంగా యువకులు సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

శ్రీరామ నవమి వేడుకల్లో కత్తుల ప్రదర్శన చేసిన వారిపై..

బోథ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలలో బహిరంగంగా కత్తుల ప్రదర్శన చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ తోపాటు పట్టణానికి చెందిన కొంతమంది యువకులు ర్యాలీ నిర్వహించారు. అయితే ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న కార్తీక్, సిండేకర్ రాహుల్, సిండేకర్ బోయిడి, ఆకాష్ అనే వ్యక్తులు బహిరంగంగా ర్యాలీలో కత్తుల ప్రదర్శన చేశారని ఎస్సై వివరించారు. నిబంధన విరుద్ధంగా ర్యాలీలో మరణ ఆయుధాలు ప్రదర్శించిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

సరైన అవగాహన లేకనే రోగాల పాలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వ్యాధులపై సరైన అవగాహన లేక వివిధ రోగాలకు గురవుతున్నారని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. సోమవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న చికిత్సలను పరిశీలించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ.. వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే అతనితో పాటు కుటుంబం కూడా ఇబ్బంది పడుతుందన్నారు. ఆరోగ్య సమస్యలు రాకుండా వ్యాధులపై అవగాహన పెంచుకుంటూ ప్రతీ ఆరు నెలలకు ఒకసారి పూర్తిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, వైద్యులు సమీయోద్దీన్, సానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం కోసం ఉద్యమ కార్యాచరణ : సీసీఐ సాధన కమిటీ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సీసీఐ ఫ్యాక్టరీని పునః ప్రారంభించడంలో ప్రజల భాగస్వామ్యం కోసం ఉద్యమకార్యాచరణను రూపొందించామని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ తెలిపారు. సోమవారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 8 నుంచి 10 వరకు గ్రామ గ్రామాన కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. అదేవిధంగా ఈ ఈనెల 9వ తేదీన ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సీఎంను కలిసి సమస్యను విన్నవిస్తామన్నారు. సీసీఐతో పాటు ఎయిర్‌పోర్టు పనులు, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్, టెక్స్‌టైల్ పార్కు సాధన కోసం ఉద్యమిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అభయారణ్యంలో దాహం దాహం

(5వ పేజీ తరువాయి...)

నీటి తొట్టెలు ఉపయోగంలోకి వచ్చే అవకాశం కనిపిస్తుంది.

వేటగాళ్ల ఉచ్చుకు బలి

అడవుల్లో తీవ్రమైన నీటిఎద్దడి ఏర్పడడంతో దాహం తీర్చుకునేందుకు వన్య ప్రాణులు మైదాన ప్రాంతాలకు తరలివస్తున్నాయి. ఈ క్రమంలో వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి బలవుతున్నాయి. వన్యప్రాణుల కదలికలను పసిగడుతున్న వేటగాళ్లు నీటి జడల వద్ద ఉచ్చులను బిగిస్తూ ప్రాణాలను తీస్తున్నారు. ఇలా రాత్రికి రాత్రే పనిని పూర్తి చేస్తూ డిమాండ్‌ను బట్టి వన్యప్రాణుల మాంసాన్ని అమ్మేసుకుంటున్నారు.ఇదంతా అధికారులకు తెలిసినా.. తేలికగానే తీసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గత కొద్ది రోజులుగా అడవుల సమీప ప్రాంతాల్లో వన్యప్రాణుల కళేభరాల ఆనవాళ్లు దొరకడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత కొద్ది రోజుల క్రితం ఉట్నూర్ మండలంలోని మారుమూల ప్రాంతంలో జింకను చంపి పంట చేనులోనే మాంసాన్ని ఆరబెట్టుకున్న దాఖలాలు బయటపడ్డాయి. గుట్టుచప్పుడు కాకుండా మరెన్నో వన్యప్రాణులు వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి బలవుతూనే ఉన్నాయి.

డెయిరీ ఫామ్‌లో ఒకరి మృతి

తలమడుగు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మడం గ్రామ సమీపంలో గల డెయిరీ ఫామ్‌లో ఒకరు మృతి చెందినట్లు తలమడుగు ఎస్సై అంజమ్మ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడం గ్రామానికి చెందిన తంగాడపెల్లి గజానన్ (28) గత సంవత్సరం నుంచి ఉమ్మడం గ్రామం శివారులో పోచమ్మ మందిరం వెనుక గల దార్ల కిష్టన్న డెయిరీ ఫామ్ చేనులో కూలీగా పని చేస్తున్నాడు. ప్రతీరోజులాగే ఆదివారం మద్యం మత్తులో చేనుకు వెళ్లి 9 గంటల వరకు డెయిరీ వర్కర్ అయిన కుందన్ కుమార్‌తో ఉండి చేనులో గడ్డి కోసేందుకు ఎవరి పని మీద వారు వెళ్లిపోయారు. తరువాత సాయంత్రం 5.30 గంటలకు గడ్డి చేనులో కుక్కలు మొరుగగా కుందన్ కుమార్ గడ్డి చేనులో అడవిపందులు వచ్చాయనుకుని వెళ్లి చూడగా థాంగాడిపెల్లి గజానాన్ గడ్డిచేనులో గల బాటదారి దూర(గట్టు)పై చనిపోయి ఉన్నాడు. మృతుడు మద్యం మత్తులో ఎండలో పనిచేసినందున భోజనం చేయనందున ఎండ వడదెబ్బ తగిలిందా? గడ్డిలో పని చేయగా ఏదైనా విషపురుగు కుట్టినందున మరణించాడా? అని మృతుడి భార్య ఒరగంటి ప్రవళిక ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

ఇచ్చోడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడేగామ(కె) గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ కూలి పనులు చేస్తున్న గణపతిపై సోమవారం ఒక్కసారిగా అడవిపంది దాడి చేసింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. అడేగామ(కె) గ్రామానికి చెందిన గణపతి(35) పంట చేనులో పనులు చేస్తుండగా అటువైపుగా వచ్చిన అడవిపంది ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్రగాయాలతో బయటపడ్డాడు. గ్రామానికి చెందిన యజమాని బద్దం రమేష్ రెడ్డికి విషయం అందించడంతో 108 అంబులెన్స్ సహాయంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నారు. గణపతికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

'శాశ్వత పరిష్కార మార్గం చూపాలి'

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శివాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్‌లో వ్యాపారం చేస్తున్న వారికి తాత్కాలికంగా గణేష్ థియేటర్ స్థలంలో వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నారని, కానీ వీరికి శాశ్వత మార్గం చూపాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ అన్నారు. సోమవారం వీధి వ్యాపారులతో కలిసి ఆయా పార్టీల నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 30ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్నారని.. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలిగించడం లేదని.. న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఏళ్లుగా ఆయా కూడళ్లలో వ్యాపారం చేసుకుంటు కుటుంబాన్ని పోశించుకున్న వారికి అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరికాదని జహీర్ రంజానీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఆయా పార్టీ నాయకులు పత్తి ముజ్జు, సిరాజ్‌ఖద్రి, షౌకత్ అలీ, వీధి వ్యాపారాలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయాలి

● నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



దిలావర్‌పూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దిలావర్‌పూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పేదలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సన్న బియ్యం పంపిణీ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే జరుగుతుందన్నారు. కిలో బియ్యానికి కేంద్ర ప్రభుత్వం రూ.40లు చెల్లిస్తుందన్నారు. కాగా కాంగ్రెస్ తమ రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో అరుణరాణి, ఎంఆర్ఐ మమత, ఎంపీవో గోవర్ధన్, బీజేపీ సీనియర్ నాయకులు వి. సత్యనారాయణగౌడ్, రావుల రాంనాథ్, బీజేపీ మండల అధ్యక్షులు అయిండ్ల నర్సారెడ్డి, మాజీ అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, స్థానిక బీజేపీ నాయకులు డి.ముత్యంరెడ్డి, చంద్రకాంత్, దిలా వర్‌పూర్ మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, సాయినాథ్, గంగారెడ్డి, ధని నర్సయ్య, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకెందుకు సమాచారం ఇవ్వలేదు : కాంగ్రెస్

సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విషయాన్ని మాకెందుకు చెప్పలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కట్కం రాజారెడ్డి తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ను ప్రశ్నించారు. ఇకపై ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటానని తహసీల్దార్ సర్ది చెప్పారు. ఇకపై ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

సారంగాపూర్ మండలం కేంద్రంలో..

సారంగాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రేషన్‌షాప్‌లో పేదలకు సన్నబియ్యం కార్యక్రమాన్ని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించి, లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు కాల్వ నరేష్, రాంశంకర్ రెడ్డి, చంద్రప్రకాష్ గౌడ్, సాహెబ్ రావు, గంగారెడ్డి, మహేష్ రెడ్డి, వీరయ్య, కోరిపెల్లి రాజులతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చిట్యాల గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల్ గ్రామంలో భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10 రోజుల పాటు నిర్వహించనున్న ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా చిట్యాల గ్రామంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పార్టీజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్‌పెల్లిలో..

లక్ష్మణచాంద, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రామ జన్మ భూమి కోసం అయోధ్యకు వెళ్లిన కరసేవకులను సన్మానించారు. కార్యకర్తలకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్నయ్య, వేడుకల కన్వీనర్ అడ్లా రమేష్, కోకన్వీనర్‌లు జీవన్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు రామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మెంగు అనిల్, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీ మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తుంది

కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కూచాడి

సారంగాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పార్టీ మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. సోమవారం మండలంలోని బోరిగాం, ధని, సాయినగర్ తాండ గ్రామాల్లో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ పార్టీ రాజ్యాంగాన్ని అవమానపరుస్తోందన్నారు. దేశ సమగ్రతను కాపాడడంలో బీజేపీ రాజకీయం చేస్తోందని న్యాయ్ భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్‌గాంధీ దేశఐక్యతను చాటి చెప్పారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రతో బీజేపీ చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, సొసైటీ చైర్మన్ మాణిక్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బి. నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ్ రాజేశ్వర్, నాయకులు శంకర్ రెడ్డి, నారాయణరెడ్డి, భోజాగౌడ్, కే. నవీన్‌రెడ్డి, సత్యం, లక్ష్మణ్, రమేష్, భోజన్న, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



బోరిగాంలో వీధుల్లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాంజ్రి గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

భైంసా రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నియోజకవర్గంలోని మాంజ్రి గ్రామంలో సోమవారం నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాంజ్రి గ్రామంలో మహాత్మాగాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్, అన్నాబావు సాటే, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావును పాటిల్, భైంసా మాజీ మున్సిపల్ చైర్మన్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి. రాంచందర్‌రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో బాధితుడికి పరామర్శ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న నల్లుర్తి గ్రామవాసి కాంగ్రెస్ నాయకుడు పడాల భీమేష్‌ను డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు సోమవారం పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలు వైద్యుడు రమేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, రవి, తదితర నాయకులు ఆయన వెంట ఉన్నారు.

నల్లుర్తి గ్రామంలో..

మామడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పడాల భీమేష్ ఆదివారం సాయంత్రం అనారోగ్యం కారణంగా జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులు డాక్టర్ రమేష్ రెడ్డితో మాట్లాడారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భీమేష్‌తో మాట్లాడుతూ... ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇందులో సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, గాజుల రవి కుమార్, తదితరులు ఉన్నారు.

సమ సమాజమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సమ సమాజమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తక్కల విద్యాసాగర్ రెడ్డి అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం సోమవారం గుండంపల్లి, సముందర్‌పల్లి, రత్నాపూర్ కాండ్లి గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కే. దేవేందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మనోహర్‌రావు, ఇప్ప నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయన్న, మైనార్టీ సెల్ నాయకుడు సలీం, మాజీ ఎంపీపీ పాల్దే అనిల్, మాజీ సర్పంచ్ కృష్ణ, వినోద్, ధని రవి, సప్పల రవి, బెల్లాజి రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతియే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

భైంసా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల,ప్రాంతాల అభ్యున్నతియే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతోందని జై బాపు,జై భీమ్, జై సంవీధాన్ ముథోల్ నియోజక వర్గ ఇన్‌చార్జి రామ్‌భూపాల్ పేర్కొన్నారు. సోమవారం భైంసా పట్టణంలోని ఏపీనగర్ కాలనీ పరిధిలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్‌లతో కలిసి పాల్గొని మాట్లాడారు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ మాట్లాడుతూ భైంసా పట్టణ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి అవసరమైన మేర నిధుల మంజూరికి కృషి చేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు షాహిద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డిలతో పాటు నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల కాంగ్రెస్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పీజీ కళాశాలగా తీర్చిదిద్దుతా

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పీజీ కళాశాలగా తీర్చిదిద్దుతానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో పదవీ విరమణ పొందిన అధ్యాపకుడు గుంత సుధాకర్ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల సౌలభ్యం కోసం గాను పీజీ కళాశాల ఏర్పాటుకు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో రూ. 5 కోట్ల నిధులతో విద్యార్థులకు ఆధునిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు గాను కృషి చేస్తున్నామన్నారు. రెండు దశాబ్దాల కాలంపై నుంచి డిగ్రీ కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి అధ్యాపకుడు గుంత సుధాకర్ అవిరాళంగా కృషి చేశారని పేర్కొన్నారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సన్మార్గంలో పయనిస్తూ, సత్ఫలితాలను సాధిస్తూ భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని ఆకాంక్షించారు. జీవిత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని సాధించేందుకు గాను ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య మాట్లాడుతూ.. కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడం వెనుక అధ్యాపకులు సుధాకర్ కృషి అనిర్వచనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధ్యాపకులు సుధాకర్‌కు ఎమ్మెల్యే రామరావ్ పాటిల్, ఏఎస్పీ అవినాష్ కుమార్, భైంసా, నిర్మల్ కళాశాలల ప్రిన్సిపళ్లు కర్రోళ్ల బుచ్చయ్య, సుధాకర్‌తో పాటు అధ్యాపకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అభినందించారు.

శిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాజేందర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య రంగంలో విప్లవాత్మక అభివృద్ధి సాధించినప్పటికీ మాతృత్వ, నవజాత శిశు మరణాల రేటు తగ్గడం లేదని వాటిని తగ్గించే దిశగా కృషి చేయాలని నిర్మల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ... ఆరోగ్యకరమైన ఆరంభాలు - ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో ఈ సంవత్సరం ముందుకు వచ్చినట్టు తెలిపారు. వైద్య రంగంలోను నూతన సాంకేతికత చోటుచేసుకుందన్నారు. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ప్రతిఏటా మూడు లక్షల మాతృ మరణాలు, 20 లక్షల నవజాత శిశు మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య విధాన పరిషత్ సూపరిండెంట్ డాక్టర్ సురేష్, మీడియా విస్తరణ అధికారి బారే రవీందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

భైంసా రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హంపోలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రభంజనం సృష్టించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెలువడించిన గురుకుల ప్రవేశ పరీక్షల ఫలితాల్లో హంపోలి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 10 మంది పరీక్ష రాయగా అందులో ఏకంగా 8 మంది విద్యార్థులు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని ఉపాధ్యాయులు బాలాజీ ముత్తన్న తెలిపారు. 8 మంది విద్యార్థులు గురుకులకు ఎంపిక కావడంతో ఎంఈవో సుభాష్ ఉపాధ్యాయులను, పోషకులను, విద్యార్థులను అభినందించారు.

మాల సంఘ భవనానికి స్థలం కేటాయించాలి

మామడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామంలో మాల సంఘ భవనాలకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని మాల మహానాడు సంఘం మండల అధ్యక్షుడు దేవోళ్ల మధుకర్ సోమవారం రోజున మాల అంబేద్కర్ సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు సభ్యులు వినతిపత్రం అందజేశారు. కొరిటికల్‌తో పాటు పలు గ్రామాల్లో మాల సంఘం భవన నిర్మాణాలకు ప్రభుత్వం కృషి చేయాలని, స్థలం కేటాయింపుతో పాటు నిర్మాణం చేసే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొరిటికల్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన గ్రామీణ సీఐ

నర్సాపూర్(జి), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం గ్రామీణ సీఐకృష్ణ రికార్డుల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు నెలల్లో జరిగిన కేసులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డోంగుర్‌గాం గ్రామంలో ఇటీవల చోరీకి గురైన పంపు మోటార్ దొంగతనానికి పాల్పడ్డ దొంగను, దొంగతనానికి ఉపయోగించిన ఆటోను పట్టుకొని విచారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ సీఐ కృష్ణ, ఎస్సై సాయి కిరణ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేసుకొని ఎరువులు వేయాలి

సోన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో కోతలు అయిన సందర్భంగా మాదాపూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాబోయే ఖరీఫ్‌కి సన్నద్ధం అయ్యే రైతులు తమ పంట పొలాల్లోని మట్టిని భూసార పరీక్షలు చేసుకొని దానికి అనుగుణంగా మాత్రమే రసాయన ఎరువులు వేయాలన్నారు.

ఫటా..ఫట్...

మహిళా సాధికారత కోసం వినూత్న పథకాలు

● డి. సుభాష్, పీడీ, మెప్మా నిర్మల్



ఆంధ్రజ్యోతి: మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు ఏంటి?

పీడీ: ప్రతీ మహిళను కోటీశ్వరాలిని చేయాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల మహిళా సంఘాలకు 150 బస్సులను అందజేసి వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తోంది ప్రభుత్వం. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో 5 క్యాంటీన్లను ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి: కేంద్ర ప్రభుత్వ పథకాలు ఏ విధంగా ఉపయోగ పడుతున్నాయి...?

పీడీ: కేంద్ర ప్రభుత్వం పీఎం ఈజీపీ, పీఎం ఎఫ్ఎంఐ, పీఎం విశ్వకర్మ, వీధి వ్యాపారులకు మద్దతుగా ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా మద్దతు ఇవ్వడం జరుగుతుంది. స్థానికంగా దొరికే వనరుల ద్వారా ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించేందుకు పీఎం ఈజీపీ పథకం దోహద పడుతుంది. ఇందులో 25 నుంచి 35 శాతం వరకు సబ్సిడీ అందజేయడం జరుగుతుంది. ఇక రెడీతో ఈట్, రెడీతో కుక్ అనే నినాదంతో ఫుడ్ ప్రాసెసింగ్‌లో కొత్త ఒరవడిని సృష్టిస్తోంది. తినడానికి, వండడానికి సిద్ధంగా ఉన్న సరుకులను విక్రయించేందుకు అందుకు కావాల్సిన యంత్రాల కొనుగోలు కోసం 30 శాతం సబ్సిడీతో ప్రాజెక్టు రిపోర్ట్ ద్వారా కోట్ల రూపాయల వరకు రుణం పొందే అవకాశం ఉంది. పీఎం విశ్వకర్మ కింద చేతి వృత్తుల వారిని ప్రోత్సహించేందుకు లక్ష రూపాయల నుంచి 3 లక్షల వరకు విడతల వారీగా రుణాలు అందజేస్తోంది.

ఆంధ్రజ్యోతి: స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రయోజనం ఏమిటి?

పీడీ: మహిళల్లో పరస్పర సహకారం, ఆర్థిక భాగస్వామ్యం, జీవనోపాధుల పెంపుదల, మహిళా సాధికారత కోసం సంఘాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. కొత్తగా ఏర్పడిన సంఘాలకు బ్యాంకుల నుంచి రుణాలు అందజేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి 10 వేల చక్రనిధి అందజేయడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: బ్యాంకు రుణాల ద్వారా ప్రయోజనం ఏమిటి...?

పీడీ: ప్రస్తుతం మార్కెట్‌లో కనీసం 2 రూపాయల వడ్డీ వ్యాపారం కొనసాగుతోంది. అదే చిన్న చితక వ్యాపారులకైతే 5 రూపాయల వరకు నెలకి వడ్డీ వసూలు చేస్తున్నారు. బ్యాంకులో 1 రూపాయి మించకుండా రుణాలు లభిస్తాయి. మొదటగా లక్ష రూపాయలతో మొదలై అనుభవాన్ని బట్టి 20 లక్షల రూపాయల వరకు రుణం అందజేయడం జరుగుతుంది. ఈ రుణాలకు ప్రభుత్వం నుండి వడ్డీ మినహాయింపు ఉంటుంది. అంటే అప్పు ద్వారా కూడా మహిళలు ఆదాయం పొందవచ్చన్న మాట. 2 లక్షల రూపాయల రుణం తీసుకుంటే మార్కెట్ లెక్కలో నెలకి 2 వేలు సంపాదిస్తున్నారు. అది కేవలం వడ్డీ రూపంలో మాత్రమే.

ఆంధ్రజ్యోతి: స్త్రీనిధి బ్యాంకు ద్వారా ప్రయోజనాలు ఏమిటి...?

పీడీ: మైక్రో ఫైనాన్స్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనాలు సృష్టిస్తూ పేదల జీవితాలతో ఆడుకుంటున్న సమయంలో పేద మహిళలను ఆదుకునేందుకు ప్రారంభించినదే స్త్రీనిధి. ఇక్కడ రోజువారి అవసరాల కోసం దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లో వారి ఖాతాలో జమ చేసే మంచి వెసులుబాటు ఉన్న మహిళా బ్యాంకు. దీని ద్వారా చిన్న తరహా రుణాలు తీసుకోవడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: ఎన్‌యూఎల్ఎం అంటే ఏమిటి..? ఏ రకమైన ప్రయోజనాలు ఉన్నాయి...?

పీడీ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం పేరు ఎన్‌యూఎల్ఎం. జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్ దీని ద్వారా 6 విషయాలలో పని చేస్తోంది. 1. సామాజిక సమీకరణ - సంస్థాగత అభివృద్ధి దీన్ని నూతనంగా ఏర్పాటైన సంఘాలను, సమాఖ్యలను ప్రోత్సహించడం అంటే నూతనంగా ఏర్పాటైన సంఘాలకు 10 చక్రనిధి, సమాఖ్యలకు 50 వేల చక్రనిధి అందజేయడం. 2. స్వయం ఉపాధి రుణాలు దీని ద్వారా వ్యక్తిగత, బృంద రుణాలను ప్రోత్సహించి ఉత్పాదక రంగాన్ని మరింత బలోపేతం చేయడం, 3. వీధి వ్యాపారుల మద్దతు ఈ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రాంతంలో వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుంది. అనతరం అందరికి 10 వేల నుండి రూ.50 వేల వరకు రుణాలు అందజేయడం, మార్కెట్లను ఏర్పాటు చేయడం. 4. నిరాశ్రయుల కేంద్రం ఏర్పాటు దీని ద్వారా పట్న ప్రాంతానికి వచ్చి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉచితంగా వసతి ఏర్పాటు చేయడం. 5. సామర్థ్యాల పెంపుదల కార్యక్రమాలు దీని ద్వారా సిబ్బంది, సంఘ సభ్యుల సామర్థ్యాలను పెంపొందించడం. 6. సృజనాత్మక కార్యక్రమాలు దీని ద్వారా పట్టణ పేదల కోసం కొన్ని సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టి వారి జీవనోపాధులను పెంచడం ముఖ్య ఉద్దేశ్యం.

ఆంధ్రజ్యోతి: స్వనిధి సే సమృద్ధి అంటే ఏమిటి..? ప్రయోజనాలు ఎలా ఉంటాయి...?

పీడీ: వీధి వ్యాపారుల కుటుంబ సంక్షేమం కోసం ప్రారంభించిన పథకం స్వనిధి సే సమృద్ధి. ఈ కార్యక్రమం 5 శాఖల ద్వారా అమలు చేయడం జరుగుతుంది. ఇందులో ఆర్థిక శాఖ, పౌర సరఫరాలు, మహిళా శిశు సంక్షేమం, కార్మిక శాఖ, ఆరోగ్య శాఖలు ఉంటాయి. వీటి ద్వారా 8 రకాల పథకాల లబ్ధిపొందవచ్చు.

● (నిర్మల్, ఆంధ్రజ్యోతి)

ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఆహ్లాదం

● ఆలయాల్లో పరిఢవిల్లుతున్న పచ్చదనం



నర్సింహా స్వామి ఆలయ ఆవరణలోని ఉద్యానవనం



పచ్చని చెట్లతో కళకళలాడుతున్న ఓంకాళేశ్వర మందిరం



సాయిబాబా మందిరం వద్ద పెరిగిన వివిధ రకాల పూల చెట్లు



భారీ వృక్షంతోనున్న చింతామణి గణేష్ మందిరం

భైంసా,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఆహ్లాదం వెల్లివిరుస్తోంది. ఆయా ప్రాంతాల్లోని ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో కొద్దిసేపు గడిపితే పచ్చదనం గుబాళింపులు మనసుకు ప్రశాంతతను ఇస్తున్నాయి. కాలుష్యానికి దూరంగా చక్కటి ఆహ్లాద వాతావరణంలో ఆధ్యాత్మిక చింతనతో గడిపేందుకు నిత్యం భక్తులు అధిక సంఖ్యలో ధార్మిక ప్రదేశాలకు వస్తున్నారు. ఆలయాల్లో గతంలో పెద్దలు నాటిన మొక్కలు నేడు మహావృక్షాలుగా మారి పలువురికి నీడతో పాటు చక్కటి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. భైంసా పట్టణంలోని కిసాన్ గల్లి ప్రాంతంలో గల సాయిబాబా మందిరం, నర్సింహా నగర్ కాలనీ పరిధిలోని నర్సింహా స్వామి మందిరం, పురాణా బజార్ ప్రాంతంలోని పురాతన మహాదేవు మందిరం, కుభీర్ రోడ్డు మార్గంలోని గణేష్ మందిరాల్లో పెరిగిన చెట్లు, ఉద్యానవనాలు భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మందిరాల్లో మల్లె, మందార, గులాబి తదితర పూల చెట్లతో పాటు నీడనిచ్చేందుకు వేప, పూజల నిర్వాహణ కోసం మామిడి, రాగి తదితర చెట్లు ఏపుగా పెరిగాయి.వీటితో గుల్‌మోహార చెట్లు ఎర్రని పూలతో శోభయమానాన్ని ఇస్తున్నాయి, వీటితో పాటు ఉద్యానవనాల్లో సరుగుడుతో పాటు మరికొన్ని షోకేసు మొక్కలు పెంచుతున్నారు.

● ఆరోగ్యకరమైన వాతావరణం

మొక్కలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో చెడు వాయువులు నశించి ప్రాణ వాయువు వంటి ఉపయుక్తమైన వాయువులు గాలిలో కలుస్తాయని శాస్త్రజ్ఞులు చెబుతుంటారు. ఏసీలు, రిఫ్రిజిరేటర్ల నుంచి విడుదలయ్యే విష వాయువులను పీల్చుకొని చెట్లు ప్రాణవాయువును అందజేస్తాయని పలు అధ్యయనాల్లో తేలింది. ఆలయాల్లో ఉండే పచ్చదనం కారణంగా ఆయా ప్రాంతాలు ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుంది.

రాంజీ గోండు వర్ధంతి సభను జయప్రదం చేయండి

● ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మొకాశి పిలుపు



మాట్లాడుతున్న ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మొకాశి

నేరడిగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలో గల ఆదివాసి విజ్ఞాన కేంద్రంలో జరిగే మర్సుకోల రాంజీ గోండు 166వ వర్ధంతి సభకు ఆదివాసులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మొకాశి పిలుపునిచ్చారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో గల ఆదివాసి భవనంలో ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన జిల్లా ఉపాధ్యక్షుడు మండాడి లక్ష్మణ్, ఆదివాసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా నాయకుడు గేడం జ్యోతిరామ్, నేరడిగొండ మండల కార్యదర్శి సోయం విజయ్ కుమార్, మండల నాయకులు పెందోర్ ధర్మ, సోయం శ్రీనివాస్, అర్క గంగారాం, ఆత్రం గంగారాం, గేడం భూమన్న, అర్క మదన్ తదితరులు పాల్గొన్నారు.

బాసర అన్నదాన సత్రంలో తాగునీటికి ఇబ్బందులు



బాసర అన్నదాన సత్రంలో పనిచేయని వాటర్ ప్లాంట్

బాసర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి దేవస్థానం అన్నదాన సత్రంలో భక్తులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్న ప్రసాదాలను స్వీకరించిన భక్తులకు తాగునీరు అందడం లేదు. భవనంలో గల మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో సమస్య ఏర్పడింది. పనిచేయక ఏడాది కాలం అవుతున్నా ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అన్నం పెట్టి భక్తులకు నీరు అందించని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితిలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి నాగభూషణం తన సొంత ఖర్చుతో ప్రతీరోజు 20 క్యాన్ల మినరల్ నీటిని కొనుగోలు చేసి భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. కోట్ల రూపాయల ఆదాయం ఉన్నప్పటికీ భక్తుల తాగునీటి అవసరాలను తీర్చే మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయకపోవడంపై భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



విజేతకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

భైంసా రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామోల్ గ్రామంలో సోమవారం శ్రీరామ ఉత్సవాల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు రూ. 6,100, ఐదు తులాల వెండి బహుమతులు అందజేశారు. మహారాష్ట్రకు చెందిన సంతోష్, తెలంగాణ రాష్ట్రానికి చెందిన నగేష్ కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. తెలంగాణకు చెందిన నగేష్ విజేతగా నిలిచాడు. ఈయనకు వీడీసీ తరఫున 6,100, ఐదు తులాల వెండి కడియంను అందజేశారు. అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుంటగూడ మాజీ సర్పంచ్ మడావి గంగారాం, ఉపసర్పంచ్ భీంరావ్

త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి

సిరికొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలోని కుంటగూడ, పాలవాగు, భీంపూర్, చిమ్మన్‌గుడి, భీంపూర్, చింతగూడ, సూర్యపేట్, రాంనగర్ గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కుంటగూడ మాజీ సర్పంచ్ మడావి గంగారాం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. గత రెండు నెలల క్రితమే జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఫారెస్ట్ విద్యుత్ శాఖ జిల్లా స్థాయి అధికారులతో జాయింట్ సర్వే చేయగా...ఆయా గ్రామాలకు చెందిన రైతులు త్రీఫేజ్ విద్యుత్ కోసం డీడీలు సైతం చెల్లించడం జరిగిందన్నారు. కాగా ఇప్పుడు ఫారెస్ట్ అధికారులు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించకుండా అడ్డుకుంటున్నారని ఎంపీతో వేడుకున్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి జిల్లా స్థాయి అటవీశాఖ అధికారులతో మాట్లాడి తమ సమస్యను పరి ష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుంటగూడ మాజజీ ఉపసర్పంచ్ భీంరావ్, ఆయా గ్రామాల రైతులు దేవ్‌రావ్, సుదర్శన్, చంపత్‌రావ్, కోట్నక్ భీంరావ్, రూప్‌సింగ్, రాథోడ్ ఉత్తమ్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం చూపిన అధికారులు



గ్రామంలోని బావిని పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బొస్రా గ్రామంలో నీటి ఎద్దడిని వివరిస్తూ సోమవారం ఆంధ్రజ్యోతిలో 'నీటి కోసం మహిళల పాట్లు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ డీఈ, ఏఈ వెంకటేష్‌తో పాటు ఎంపీడీఓ శ్రీనివాస్, ఏంపీవో మహేందర్‌లు స్పందించారు. సోమవారం బొస్రా గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంకును రోజుకు రెండు సార్లు నింపి గ్రామస్థలకు నీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్యను తమ దృష్టికి తీసుకురావాలని గ్రామపంచాయితీ అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఏ గ్రామంలోనూ నీటి ఎద్దడి కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సొంటకే గజానంద్, గ్రామస్థులు చందపూరే సూర్యకాంత్ జ్ఞానోభ, నాందేవ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు

పక్కదారి పడుతున్న సబ్సిడీ స్ప్రింక్లర్లు

● సమాచారం లేని రైతులు

● సంపన్న రైతులకే చేరుతున్నాయని విమర్శలు

బోథ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించాలని ప్రోత్సహించేందుకు గాను సబ్సిడీ పైన స్ప్రింక్లర్ల సెట్లను అందిస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1200 స్ప్రింక్లర్లు కాగా ఆదిలాబాద్ నియోజకవర్గానికి 500, బోథ్ నియోజకవర్గ రైతుల కోసం 700 ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే స్ప్రింక్లర్ సెట్లు దళారీలకే చేరుతున్నాయని రైతులు వాపోతున్నారు.

● పైరవీకారులకే..

ప్రభుత్వ పరంగా మంజూరు అయిన స్ప్రింక్లర్ సెట్లు పైరవీ కారులకు దొరుకుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆన్‌లైన్‌లో వేల సంఖ్యలో రైతులు దరఖాస్తు చేసుకున్న వారికి సెట్లు అందకపోగా కొంత మంది నాయకులు సిఫారసు చేసిన లేఖలపైన అందిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గానికి చెందిన ఓ యువ నాయకుడు అన్ని తాను వివరిసూ స్ప్రింక్లర్ సెట్‌లను కమీషన్‌పై తీసుకువస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

● సమాచారం లేని రైతులు

ప్రభుత్వ పరంగా సబ్సిడీపై స్ప్రింక్లర్ సెట్లు వస్తున్నాయి అన్న విషయం రైతులకు తెలియకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. అధికారులు కేవలం కొంతమంది రాజకీయ నాయకులకు చెప్పడంతో వారే ఈ తతంగానికి తెరలేపి కమీషన్ దందా నడుపుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఏది ఏమైనా అధికారులు, గ్రామ పంచాయతీల వరకు విషయాన్ని తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● అర్హులకు అందిస్తున్నాం

సబ్సిడీ స్ప్రింక్లర్‌లు నిజమైన రైతులకు అందిస్తున్నామని, ఇందులో అక్రమాలు జరిగేందుకు ఆస్కారం లేదని హార్టికల్చర్ అధికారి క్రాంతి తెలిపారు. తాము రైతుల వద్దకు వెళ్లి అర్హతలు అన్ని పరిశీలించి సెట్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతుల పొలాలకు వెళ్లి ఫోటోలను దిగి ఇస్తున్నామన్నారు.

అడుగంటుతున్న చెరువులు

● రైతుల ఆందోళన

బోథ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన ఎండల కారణంగా నియోజకవర్గ పరిధిలోని చెరువులు ఎడారులను తలపిస్తున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు పాతాళంలోకి వెళ్లిపోయాయి. రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు భవిష్యత్తులో పశువులకు సైతం సాగునీటి ఇబ్బందులు తప్పేట్టు లేవని వాపోతున్నారు.

● గ్రామాల్లో దాహం దాహం

భూగర్భ జలాలు ఊహించని రీతిలో అడుగంటి పోవడం వల్ల తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామాల సమీపంలోని బావులన్నీ ఎడారులను తల పిస్తుండగా బోథ్, బజార్హత్నూర్ చెరువుల్లో నీటి జాడ కనిపించడం లేదు. దీంతో చెరువుల్లో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి.

● పూడిక పనులు చేపట్టండి

చెరువులో నీరు అడుగంటిపోవడం వల్ల సారవంతమైన నల్ల రేగడి మట్టి లభిస్తుంది. అయితే రైతులు ఈ మట్టిని పూడిక తీసి తమ పొలాల్లో వేసుకుంటే సారవంతమైన ఎరువుగా ఉపయోగపడే ఆస్కారం ఉంది. ప్రభుత్వం స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని చెరువుల గ్రామాల సమీప రైతులు పేర్కొంటున్నారు.



కాలువను తలపిస్తున్న దేగామా చెరువు



ఎండిపోయిన దేగాము చెరువు



వాయిపేట్ సెక్షన్ గోపాల్‌పూర్ బీట్ పరిధిలోని అడవుల్లో నిరుపయోగంగా మారిన సాసర్‌ఫిట్స్

సిరిచెల్మ రేంజ్ పరిధిలో చెన్నాదేవరంలో నిరుపయోగంగా మారిన సాసర్‌ఫిట్స్ (ఫైల్)

అభయారణ్యంలో.. దాహం దాహం

- జిల్లాలోని కవ్వాల్ అభయాణ్యంలో అడుగంటిన నీటిజాడలు
- దాహంతో అల్లాడుతూ.. సమీప మైదాన ప్రాంతాలకు వస్తున్న వన్యప్రాణులు
- వేటగాళ్ల ఉచ్చులతో పొంచి ఉన్న ముప్పు
- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను మొదలు పెట్టని అటవీ శాఖ అధికారులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తరించి ఉన్న కవ్వాల్ అభయారణ్యం అడవుల్లో వన్యప్రాణులు దాహంతో అల్లాడుతున్నాయి. జిల్లాలో గత కొద్ది రోజులుగా 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ యేడు వేసవి ప్రారంభంలోనే భూగర్భజలాలు వేగంగా పడిపోవడంతో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడుతుంది. దీంతో కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని అడవులను ఆనుకొని ఉన్న వాగులు, ఒర్రెలు, చెలిమెలు, చిన్ననీటి కుంటలు, కందకాలు, చెక్‌డ్యాములు అడుగంటుక పోతున్నాయి. జిల్లాలో 40 వేల హెక్టార్లలో కవ్వాల్ టైగర్ జోన్ అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 171 బీట్లు ఉన్నాయి. వీటి పరిధిలో 2017-18 వన్యప్రాణుల గణాంకాల ప్రకారం జిల్లాలో శాఖహార జంతువులు 1332, మాంసాహార జంతువులు 175 ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. దాహం తీర్చుకునేందుకు వన్యప్రాణులు కిలోమీటర్ల మేర దూరం తరలిపోతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాల భారీన పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలోనే తాగునీటి వసతిని కల్పించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టాలని జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.



నీటికి గడ్డు పరిస్థితి

వేసవి పరిస్థితుల్లోనే అడవుల్లో వన్యప్రాణులకు గడ్డు పరిస్థితులు ఎదురవుతాయి. వీటిని అధిగమించి అటవీ జంతువుల సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా అడవుల్లో చెలరేగే కార్చిచ్చు మంటల ప్రమాదం నుంచి తప్పించుకోవడం వన్యప్రాణులకు పెద్ద సవాల్‌గానే మారింది. దీనికి తోడు మండిపోతున్న ఎండలకు తీవ్రమైన దాహంతో అల్లాడుతున్నాయి. వానాకాలం, శీతాకాలం సీజన్‌లలో పెద్దగా నీటిఎద్దడి లేకపోయినా.. వేసవిలోనే తీవ్రమైన నీటిఎద్దడి ఎదురవుతోంది. వేసవి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అటవీ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతో నోరులేని మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ఇప్పటికే తీవ్రమైన దాహాన్ని తట్టుకోలేక వన్యప్రాణులు మృత్యువాత పడుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. నీటి వసతితో పాటు వేసవిలో పచ్చిగడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ కవ్వాల్ అభయారణ్యంలో ఎక్కడ అలాంటి చర్యలను చేపట్టినట్లు కనిపించడం లేదంటున్నారు. ప్రతీ సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వన్యప్రాణుల సంరక్షణ కోసం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితిలే ఉన్నాయి.

నిరుపయోగంగా సాసర్‌ఫిట్స్

వేసవిలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అధికారులు అడవుల్లో సాసర్‌ఫిట్స్ నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. వేసవి ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతున్నా.. ఇప్పటి వరకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టడం లేదు. అంతేకాకుండా కనీసం నీటి తొట్టెల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని కూడా తొలగించిన దాఖలాలు లేవు. వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి నీటి తొట్టెలను నింపాల్సి ఉన్నా.. సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టక పోవడంతో నిరుపయోగంగా మారి కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల సాసర్‌ఫిట్స్ శిథిలమైపోయి దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేపడితే

(తదుపరి 6వ పేజీలో...)



గిరిజన దర్బార్‌లో అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న పీవో

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో ఉన్న ఛాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం చందోరి గ్రామానికి చెందిన పోసుబాయి తనకి ఏదైనా అంగన్‌వాడీ సెంటర్‌లో ఉద్యోగం కల్పించామని, తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన గట్లనర్సయ్య తనకి మేకలలోన్ మరియు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని, నేరడిగొండ మండలం కుంటాల గ్రామానికి చెందిన సిడం లక్ష్మి తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో వర్కర్‌గా ఉద్యోగం కల్పించామని కోరారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో ఖుష్బుగుప్తా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ గిరిజన దర్బార్‌లో ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, ఏవో దామోదరస్వామి మనోహర్, ఈఈ తనాజీ, పీహెచ్‌వో సందీప్‌కుమార్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తర్నం బ్రిడ్జిపై రాకపోకల నిలిపివేత

జైనథ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలోని తరోడ(బి) తాత్కాలిక బ్రిడ్జి నుంచి ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు నేషనల్ హైవే డీఈ సుభాష్, జైనత్ రూరల్ సీఐ డి.సాయినాథ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తర్నం డ్యామేజ్ బ్రిడ్జిపై నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను తీసి కింద తాత్కాలిక బ్రిడ్జికి అనుకొని పైప్‌లైన్‌ను నిర్మిస్తున్నారని తెలిపారు. వాహనదారులు నిరాల నుంచి లాండసాంగ్వి మీదుగా ఆదిలాబాద్ మార్గం వైపు వెళ్లాలని సూచించారు. ఇందుకు జైనథ్, బేల మండలాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర ప్రజలు, వివిధ వాహనదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్ కోరారు.



భూమిపూజ చేస్తున్న సంఘటన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

కాలానుగుణంగా సీబీఎస్ఈ సిలబస్

- సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాలనుగుణంగా శ్రీ సరస్వతీ శిశుమందిరాల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రారంభించనున్నట్లు శ్రీసరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ కోసం నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. దీనికి ఆయనతో పాటు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తిపై విద్యార్థులకు తెలియజేస్తూ.. కాలనుగుణంగా సరస్వతీ శిశుమందిరాల్లో కూడా సీబీఎస్ఈ సెలబస్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోలం ఓంప్రకాష్, కట్ట నాగచారి, రాజేశ్, రావుత్ రవీందర్, బండ పాటి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'మా కృషితోనే ఎయిర్ పోర్ట్ మంజూరు'

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎయిర్ ఫోర్స్‌తోపాటు ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు కోసం గత పదేళ్లుగా మేము చేసిన పోరాటం వల్లే సాధ్యపడిందని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి సహకరించడం శుభ పరిణామం అని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలోనే భూసేకరణ మౌలిక వస్తువుల ఏర్పాటు జరుగుతుందని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అదిలాబాద్ జిల్లాపై దృష్టి సారించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజల కల ఎయిర్ పోర్టు మంజూరు చేసినందుకు ప్రధాని మోదీ తో పాటు కేంద్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, లాలా మున్న, మయూర్ చంద్ర నగేష్, జోగు రవి వేద వ్యాస్ దినేష్ మాటోలియా, కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలను విజయవంతం చేయాలి'

ఇచ్చోడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్, కార్యనిర్వహణ అధ్యక్షుడు ఆత్రం మహేందర్ కోరారు. ఈనెల 12, 13, 14వ తేదీలలో కొమురంభీం జిల్లా కెరమేరి మండలంలోని కొమురం భీం యుద్ధ భూమి జోడెన్‌ఘాట్‌లో నిర్వహించే మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆదివాసీలు ఎందుర్కొంటున్న సమస్యలపై చట్టసభల్లో ఏకరువు పెట్టాల్సిన ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలం అయ్యారని మండిపడ్డారు. ఆదివాసీలపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ఆదివాసీలు సంసిద్ధం కావాలన్నారు. ఈ మేరకు జోడెన్‌ఘాట్‌లో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకలు సిడాం మురళీ, గణపతి, మనోజ్, మాన్కు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సరైన విద్యను అందించండి

- ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

నార్నూర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్య నేర్చుకుంటున్న పేద విద్యార్థులకు సరైన విద్యను అందించాలంటూ తుడుందెబ్బ అనుబంధ ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఖక్కి గ్రామంలో ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో చాలా పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉందని, కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. ఆదివాసీ గిరిజన పిల్లల భవిష్యత్తు నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కానీ ఇక్కడ పలు పాఠశాల ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కాకుండానే ఇష్టానుసారంగా రావడం పోవడం చేస్తున్నారన్నారు. ఇప్పటికీ చాలా విద్యార్థులకు సరిగ్గా చదవడం రాదంటే ఎలా ప్రశ్నించారు. పేదవారి పిల్లల పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్నారు. అధికారులు, ఎస్ఆర్‌పీ, స్కూల్ కాంప్లెక్స్‌లు ప్రతీనిత్యం నిఘా పెట్టిన తప్పు చేసిన వారిపై కట్టిన చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఇక విద్యార్థుల పక్షాన పోరాటాలు చేయాల్సిన అవసరం వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



తాంసిలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

తాంసి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఈ ఈ ఎంఏ షాకీర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ నిర్మాణానికి స్లాబ్ వేశారు. దీంతో ఆయన ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుకున్న సమయంలోపే ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖ అధికారులు దగ్గర ఉండి పనులు జరిపించాలన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విషయంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామన్నారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తామని, ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని కోరారు. తాంసిలో నిర్మిస్తున్న మాడల్ ఇంటి నిర్మాణం మాదిరిగానే ప్రతీఒక్కరు ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుందని సూచించారు. జేఈ నసీర్ అహ్మద్, రామన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నేరడిగొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలం వాంకిడి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక కాని వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. అర్హులైన వారు లబ్ధిపొందేలా కృషి చేస్తానని అన్నారు. అనంతరం గ్రామంలో వాడవాడకూ తిరిగి గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిస్కారమే ధ్యేయంగా కృషి చేస్తామని అన్నారు.

ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

నేరడిగొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆడే గజేందర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిన ఇచ్చోడ మండలంలోని నవేగాం గ్రామస్థులు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పైలట్ ప్రాజెక్టు క్రింద నవేగాం గ్రామాన్ని ఎంపిక చేసినందుకు ఆడే గజేందర్‌కు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంద్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ పేదవాడికి ఇళ్లు కట్టిస్తామని, త్వరలోనే గ్రామానికి వస్తానని ఏ సమస్య ఉన్న తనకు తెలిపితే పరిష్కరిస్తామని తెలిపారు. ఇందులో ప్రవీణ్ పాటిల్, రామరావు, గుండిబా, దిగంబర్ పాటిల్, బాపుస్, భారత్ జమీందార్, లక్ష్మన్, దుంగేష్, తదితరులు పాల్గొన్నారు.

12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న ఆదిలాబాద్ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల చరిత్రలో మొదటిసారిగా 1980 నుంచి అన్ని బ్యాచ్‌లకు పూర్వ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కళాశాలలో సమ్మేళనానికి సంబంధించి సమావేశాన్ని ప్రిన్సిపాల్ రాంబాబు అధ్యక్షతన నిర్వహించగా అందుబాటులో ఉన్న అల్యూమ్ని సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం జరిపించడానికి కార్యాచరణ జరిపి అడ్‌హక్ కమిటీని ఎన్నుకోగా సమ్మేళనం విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● ప్రజావాణికి తరలివచ్చిన అర్జిదారులు ● మొత్తం 111 దరఖాస్తులు ● హాజరైన ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన అర్జీలు అన్నింటినీ సత్వరమే పరిష్కారమయ్యేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించి.. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొత్తం 111 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఉన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

- 'ఉర్దూలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి'

ఆదిలాబాద్ బస్టాండ్‌లో ఉర్దూ సైన్ బోర్డుల నిర్లక్ష్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ మొహమ్మద్ అలీ మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ తరపున ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్ వంటి వైవిధ్యభరితమైన, బహు భాషా ప్రాంతంలో, ప్రజా ప్రదేశాలలో ఉర్దూ భాషా ప్రాతినిధ్యాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం వంటి ప్రాముఖ్యతలను వారు ఈ సందర్భంగా వివరించారు.

- 'జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి'

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల పక్ష రైతు సంఘం నాయకులు కలెక్టరేట్ కలెక్టర్ రాజర్షి షాను కోరారు. ఈ మేరకు ఆదిలాబాద్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సైతం అందజేశారు. జిల్లావ్యాప్తంగా రైతులు 79 వేల ఎకరాల్లో జొన్న పంటను పండించారని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎంఎస్‌పీ ధర కన్న తక్కువగా కొనుగోలు చేస్తున్నారని కావున ప్రభుత్వం ఎంఎస్‌పీ ధరకు కొనుగోలు చేసి రైతుల న్యాయం చేయాలన్నారు.

- 'పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి'

ఈనెల 11న ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతి బాపూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్, మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ కోరారు. కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

- 'పాఠశాల భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి'

ఆదిలాబాద్ ఆదిత్య నగర్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల కోరారు. సోమవారం కలెక్టర్ రాజర్షి షా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అద్దె భవనంలో పాఠశాల కొనసాగుతుందని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని రాబోయే విద్యా సంవత్సరానికి ముందు భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.



ముత్నూర్‌లో పాదయాత్ర చేస్తున్న నాయకులు

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత : ఆడె

గుడిహత్నూర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు రాజ్యాంగ పరిరక్షణకు ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జీ ఆడే గజేందర్ అన్నారు. జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా సోమవారం మండలంలోని మచ్చాపూర్, ముత్నూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడె గజేందర్ మాట్లాడుతూ ఎంతో శ్రమించి రాసిన రాజ్యాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. రాజ్యాంగం కాపాడేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడే శీల, నాయకులు గున్నాల గణేష్ గౌడ్, కరుణాకర్, నాగ్ నాథప్పా, అంకతి రవి, తదితరులు పాల్గొన్నారు.

- 'ప్రజాస్వామ్య రక్షణనే జైబాపు, జై భీమ్, జై సంవిధాన్'

సోనాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని ప్రజాస్వామ్యాన్నిరక్షించుకోవడానికి రాహుల్‌గాంధీ జై బాపు, జై భీమ్, జైసంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చినట్లు కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. సోమారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, శివాజి విగ్రహాలకు పూలమాల వేసి పాదయాత్రను ప్రారంభించారు. రాజ్యాంగం వచ్చి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు

- బీఎస్ఎన్ఎల్ డీఈ శివ నాగేశ్వర్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించేలా కృషి చేస్తున్నామని డీఈ శివ నాగేశ్వర్ అన్నారు. సోమవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కస్టమర్ సర్వీస్ మంత్‌లో భాగంగా సేవా శిబిరాన్ని నిర్వహించారు. వినియోగదారులు వారి సమస్యలను అధికారులకు విన్నవించారు. కొన్నింటిని అక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా డీఈ శివనాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరింత చేరువచ్చేలా కార్పొరేట్ కంపెనీలు ప్రకటించిన విధంగా కస్టమర్ సర్వీస్ మంత్‌లో భాగంగా శిబిరాలను నిర్వహించి వారి సమస్యలను తెలుసకుంటున్నామని తెలిపారు. సీమ్, నెట్వర్క్, టెలి ఫోన్ బిల్లులు, ఎంఎన్ఎస్ వాటిపై 25 ఫిర్యాదులు రాగా.. 20 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. మరో ఐదు ఫిర్యాదులను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా ఈనెల 22న మరోసారి శిబిరాన్ని నిర్వహిస్తామని సమస్యలను నేరుగా వచ్చి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం రంజిత్, ఏసీఈలు, జేటీవోలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

సోనాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ సతీష్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7, 8, 9వ తరగతి విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన లోపం వలన అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యార్థులు చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 సేవలను వినియోగించుకోవాలన్నారు. చిన్నపిల్లల పెళ్లిళ్ల వల్ల జరిగే అనర్థాల గురించి పిల్లలతో పోషక ఆహార లోపం వలన విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని టీవీ మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగుబాయి అన్నారు. ఇందులో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సచిన్, ఉపాధ్యాయులు మధుసూదన్, ప్రతాప్, ఓస శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.